క్లుప్తంగా

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల విభాగాల పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో పలు విభాగాలను రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం పరిశీలించారు. విభాగాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. పారిశుధ్య లోపాలు లేకుండా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా విభాగ పరిసరాలు తీర్చిదిద్దాలని ఆమె సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. విద్యార్థుల ఆరోగ్యం ఎంతో ప్రధానమని, దీనిలో రాజీ పడేది లేదన్నారు.

శాంతి భద్రతలపై దృష్టి సారించండి



మేయర్ హరివెంకటకుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ సోమశేఖర్

ఆరిలోవ: ఇటీవల ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సీఐ సోమశేఖర్ సోమవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. పెదగదిలిలో మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆమెను ఎస్ఐ జి.అప్పారావుతో కలసి వెళ్లి సీఐ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ సీఐని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆరిలోవలో శాంతి భద్రతలపై దృష్టి సారించాలన్నారు. ఇక్కడ గంజాయి సేవించిన బ్యాచ్‌లు, ఆకతాయిల అల్లర్లు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని ఆమె సూచించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



వైఎస్సార్ సీఎం కప్ క్రికెట్ టోర్నీలో బ్యాటింగ్ చేస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గం పరిధిలోని వార్డుల జట్లకు కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీఎం కప్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ టోర్నీని సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సందర్శించారు. జట్ల సభ్యులను అభినందించారు. అనంతరం వారితో కలసి కొంత సేపు ఆట విడుపుగా క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, విక్టర్, వెంకటరెడ్డి, సాగరిక, శిరీష, వీర్రాజు పాల్గొన్నారు.

పోషికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బీచ్ రోడ్డు: పోషికాహారం రోజూ తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కాస్మెటాలజిస్ట్ గీతిక అన్నారు. జాతీయ బాదం దినోత్సవం సందర్భంగా సోమవారం పోషికాహారం–ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. బాదం వంటి డ్రైఫ్రూట్స్ రోజుకు 30 గ్రాములు తీసుకోవడం వల్ల చర్మ వ్యాధులతో పాటు గుండె జబ్బులు, మధుమేహం దూరం చేయవచ్చునన్నారు.

29న ఫుట్‌బాల్ శిక్షణకు ఎంపికలు

బీచ్ రోడ్డు: దాకమర్రిలోని కందుకూరి క్రికెట్ అకాడమీలో రెసిడెన్షియల్ అకాడమీలకు ఫుట్‌బాల్ శిక్షణతో కూడిన బోర్డింగ్ స్కూల్స్ ట్రయల్స్ ఈ నెల 29న నిర్వహించనున్నట్టు భైచుంగ్ భూటియా ఫుట్‌బాల్ పాఠశాల ప్రతినిధి కిషోర్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో ఫుట్‌బాల్ శిక్షణ ఎంపిక వివరాలను సోమవారం ఆయన విలేకరులకు వివరించారు. ఈ ట్రయల్స్ రెండు దశల్లో ఉంటాయన్నారు. మొదటి దశలో ప్రాంతీయ స్థాయి, తర్వాత జాతీయ స్థాయిలో ఎంపిక ఉంటుందన్నారు. క్రీడాకారులు ఐడీ కార్డుతో పాటు ఫుట్‌బాల్ కిట్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 75749 80867 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే విజయం తథ్యం

- వైఎస్సార్‌సీపీ తూర్పు పరిశీలకుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధత, అంకిత భావంతో పనిచేయాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణ కోరారు. సోమవారం వుడా చిల్డ్రన్ ఎరీనాలో తూర్పు నియోజకవర్గం సచివాలయం కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం పేదల కోసం ఆలోచించలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పేదల అభ్యున్నతి కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు చేరేలా సచివాలయం కన్వీనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. పథకాల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కొంత మంది పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వాటిని కన్వీనర్లు పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా సచివాలయం సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేస్తే 2024లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. తన వైపు నుంచి ఎటువంటి సహకారం కావాలన్నా ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

త్వరితగతిన కొండవాలులో సమస్యల పరిష్కారం

- అధికారులకు అక్కరమాని ఆదేశం
- జీవీఎంసీ 12వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



బీసీ కాలనీలో మహిళకు కరపత్రం అందించి సమస్యలు తెలుసుకుంటున్న విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు కొండవాలులో సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, పార్టీ స్థానిక నాయకులతో కలసి సోమవారం కొండవాలు ప్రాంతం బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలు అందించారు. వాటి ద్వారా ఎవరు ఏ విధంగా లబ్ధి పొందారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు తమ సమస్యలు విన్నవించుకున్నారు. విద్యుద్దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ నిత్యం చీకటిలో ఉంటున్నామని, రోడ్లు, మెట్లు మార్గాలు శిథిలమయ్యాయని, కొన్నిచోట్ల మెట్లు లేకపోవడం, నీటి సరఫరా లేకపోవడం తదితర సమస్యలతో కొన్నాళ్లుగా ఇబ్బందిపడుతున్నామని స్థానికులు మొరపెట్టుకున్నారు. దీంతో అక్కరమాని సంబంధిత అధికారులతో మాట్లాడి బీసీ కాలనీలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, సూర్యారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగండి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఫార్మసీ కళాశాల విద్యార్థుల స్వాగత సభ



మాట్లాడుతున్న వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విశ్వవిద్యాలయంలో చేరిన తొలిరోజు నుంచి భవిష్యత్తులో సాధించాల్సిన నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. సోమవారం ఉదయం ఏయూ ఫార్మసీ కళాశాల విద్యార్థుల స్వాగత సభలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలని, తద్వారా జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. విభిన్న రంగాలలో విజేతలుగా నిలిచిన వారి విజయ గాథలను చదవాలని సూచించారు. విజయం సాధించడంలో వారి ప్రయాణం, ఎదురైన సంఘటనలు వంటివి తెలుసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కోర్సులు చేయడానికి ఆసక్తి చూపాలని చెప్పారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యాలను ముందుగా తెలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. ఏయూ ఫార్మసీ కళాశాల ఎందరో దిగ్గజాలను తీర్చిదిద్ది సమాజానికి అందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఈశ్వర్ కుమార్, గిరిజా శాస్త్రి, గిరిజా శంకర్, మురళీకృష్ణ, శైలజ, అరుణ్ సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: రోడ్డు భద్రత నియమాలపై స్థానిక కేడీపీఎం ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిటీ బస్‌లో ఫుట్ బోర్డ్‌పై ప్రయాణం చేయరాదని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపరాదని, రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌ను వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నియమాలతో తయారు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్.సుమతిబాయి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కర్బన ఉద్గారాలు తగ్గించాలి



ప్రసంగిస్తున్న హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్

ఏయూ క్యాంపస్: కర్బన ఉద్గారాలను తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి జరగాలని హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్ అన్నారు. సోమవారం ఉదయం ఐఐపీఈ ప్రాంగణంలో 'టెక్నాలజీ ఫర్ ఆప్‌బేట్‌మెంట్ ఆఫ్ ప్రీ, పోస్ట్ కార్బన్ ఎమిషన్స్'మూడు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, రిఫైనరీల నుంచి కర్బన ఉద్గారాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో చేపట్టే గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు తెలియజేశారు. కార్బన్ న్యూట్రాలిటీ సాధించే దిశగా హెచ్‌పీసీఎల్ చర్యలు చేపడుతున్న విధానం వివరించారు. బ్లూ హైడ్రోజన్ కోసం చేపడుతున్న పైలట్ ప్రాజెక్టులు వంటివి తెలియజేశారు. ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ మాట్లాడుతూ పరిశోధన సంస్థగా మెరుగైన సమాజం కోసం ఐఐపీఈ కృషి చేస్తోందన్నారు. కర్బన ఉద్గారాల నియంత్రణకు అవసరమైన నవ్య ఆవిష్కరణలు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రవి కిరణ్, శ్రీధర్ పల్లా, హేమంత్ కుమార్ తన్నేరు, 60 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సుజల కేంద్రం



ఆరిలోవలో మూసి ఉన్న సుజల కేంద్రం

ఆరిలోవ: ఆరిలోవలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల కేంద్రం నిరుపయోగంగా మారింది. స్థానిక ముస్తఫా కాలనీలో జీవీఎంసీ ఆస్పత్రి ఎదురుగా ఎన్టీఆర్ సుజల పథకం పేరుతో 2014 అక్టోబరు 2న దీనిని ఏర్పాటు చేశారు. ఇక్కడ మినరల్ వాటర్ 20 లీటర్ల కేన్ రూ.2 విక్రయించేవారు. ప్రారంభంలో వినియోగదారులు ఇక్కడి నుంచి నీటి కొనుగోలుకు ఆసక్తి చూపేవారు. ప్రారంభంలో రోజులో 200 పైగా కేన్‌లు విక్రయం జరిగేవి. సుమారు రెండేళ్ల పాటు ఈ కేంద్రం బాగానే నిర్వహించారు. అనంతరం ఇక్కడి నీటికి డిమాండ్ తగ్గిపోవడంతో కొన్నాళ్లు రోజుకు 20 నుంచి 30 కేన్‌లు విక్రయాలు జరిగేవి. రెండేళ్ల నుంచి రోజుకు 5 నుంచి 10 కేన్‌లు కూడా విక్రయం జరగడంలేదు. దీంతో ఈ కేంద్రం నిత్యం మూతపడే ఉంటుంది. ఈ కేంద్రంలో రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన యంత్రాలు మరికొన్నాళ్లకు తుప్పుపట్టిపోతాయేమోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యా సమాచారమ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతంలో మంగళవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విమ్స్‌కు సంబంధించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో 11 కేవీ కైలాసగిరి, రెవెన్యూ కాలనీ ఫీడర్లలో విద్యుత్ నిర్వహణ పనులు జరగనున్నాయని ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోడ్ల పక్కన విద్యుత్ తీగలకు ఆటంకంగా మారిన చెట్ల కొమ్మలు తొలగించనుండడంతో విశాలాక్షినగర్, సంజీవినగర్ కాలనీ, రెవెన్యూ కాలనీ, నాటుకోళ్ల రోడ్డు, చలపతినగర్, హనుమంతవాక కొండవాలులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఏయూ సమాచారమ్

జయహో జనగణమన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఈ నెల 24 ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్న జయహో జనగణమన వారోత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జనగణమన గీతాలాపన ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయ గీతంగా ఆమోదించి జనవరి 24కు 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు జిల్లాలో జనగణమన గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ముగింపు కార్యక్రమం ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ ఆచార్య కె.పల్లవి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జనగణమన–రవీంద్రనాథ్ ఠాగూర్ అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గొల్ల ప్రదీప్‌రాజ్, మహమ్మద్ ఇషాక్, నరేష్, కొయ్య రామకృష్ణ, సుధాకర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ, సాయిబాబా పరస



సీతారాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు



భజన చెట్టు వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో కొలువుదీరిన శ్రీసీతారామ, సాయిబాబా, దత్తాత్రేయ, సరస్వతి ఆలయం వార్షిక పరస సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రామాలయంలో ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భజన చెట్టు ఏర్పాటు చేసి వెంకోజీపాలెం భజన సభ్యులు, మహిళా కళాకారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. బుర్రకథ ప్రదర్శన అలరించింది. పరసలో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల స్టాళ్ల వద్ద పెద్దలు, చిన్నారులు సందడి చేశారు. శ్రీసీతారాములను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

19వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని

ఎంవీపీ కాలనీ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 19వ వార్డులో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో 19వ వార్డు పెదజాలరి పేటలో ఈ పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పార్టీ నాయకుడు సూరాడ దాసు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రాజధానితోనే రాష్ట్రాభివృద్ధి వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న రాజు గౌడ్

ఎంవీపీ కాలనీ: విశాఖ రాజధానితోనే రాష్ట్ర అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి(యూఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ అన్నారు. ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో సోమవారం సమితి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ వేయాలంటే అందుకు విశాఖ రాజధాని నిర్ణయమే సరైనదన్నారు. విశాఖలో రాజధాని ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన స్వాగతించారు. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యకలాపాలు ఇక్కడి నుంచి ప్రారంభమవుతాయని పలువురు నాయకులు, అధికారులు వెల్లడించడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన విశాఖ పరిపాలన రాజధానిగా సేవలను ప్రారంభించాలని రాజుగౌడ్ కోరారు. రాజధానికి కావాల్సిన అన్ని అర్హతలు విశాఖకు ఉన్నాయని చెప్పారు.

నేతాజీ త్యాగం స్ఫూర్తిదాయకం



నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎల్

బీచ్ రోడ్డు: నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆర్కే బీచ్‌లోని నేతాజీ విగ్రహానికి ఎంపీ జీవీఎల్ నరసింహారావు, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర చిరస్మరణీయమన్నారు. నేతాజీ సేవలను దేశ ప్రజలకు చేరవేయడంతో పాటు ఆయన త్యాగాలను స్మరిస్తూ ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక్, శశి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ వైజాగ్ సభ్యులు



చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హేమంత్ కుమార్

మద్దిలపాలెం: చంద్రబోస్ జయంతి వేడుకలు ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ కేవీఎన్ ప్రసాద్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్, క్లబ్ అధ్యక్షురాలు సునీత లావణ్య, కార్యదర్శి గాయత్రి, హెచ్ఎం అనుపమ పాల్గొని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్ : మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో మహిళా చట్టాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం–1994పై ఆయన మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరు సమానమేనన్న విషయాన్ని కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. వివాహితులు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కౌన్సిలర్ అనిజాకుమారి, సీనియర్ న్యాయవాది సుధ, అంగన్‌వాడీ టీచర్లు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు వృత్తి నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్

మద్దిలపాలెం: విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయడానికి వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మహారాజ ప్రభుత్వ సంస్కృతిక కళాశాల అధ్యాపకుడు డాక్టర్.పి.అనిల్‌కుమార్ అన్నారు. మద్దిలపాలెంలో నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభమైన రెండో దశ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 25వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి కోర్సుల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, నోడల్ రిసోర్స్ కో ఆర్డినేటర్ పి.వాణి, మాస్టర్ ట్రైనర్స్ రాజశేఖర్ సి.హెచ్.వి.సాయి కృష్ణ, గీతాంజలి, శంకర్, పోలా ఉమామహేశ్వరరావు, 12 కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో కృత్రిమ చేతుల అమరిక శిబిరం

అల్లిపురం: ఇనాలి ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, సెంట్రల్ క్లబ్ ఆఫ్ పూనా డౌన్‌టౌన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8,9 తేదీల్లో బ్యాటరీతో పని చేసే కృత్రిమ చేతుల అమరిక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో రోటరీ సభ్యులు పి.బాలసతీష్, లావణ్య ముస్తీ అల్తాఫ్ మాట్, రోహిత్ వివరాలు వెల్లడించారు. మణికట్టుకు పైన, లేదా కింద 5 అంగుళాలు మేర చేయి ఉన్నవారు మాత్రమే ఈ ప్రొస్థెటిక్ బ్యాటరీ ఆపరేటెడ్ హ్యాండ్ ఏర్పాటుకు అర్హులని తెలిపారు. కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోను 7795137999, 7659024247 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. అర్హులైన వారందరికీ ఫిబ్రవరి 8,9 తేదీలలో రైల్వే న్యూకాలనీ, మెయిన్‌రోడ్డులోని ఐటీసీ పెట్రోల్‌బంక్ వద్ద గల కౌన్సిల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, విశాఖ సేఫ్టీలో ఫిట్‌మెంట్ శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.